క్లుప్తంగా

గ్రామాల విలీనంపై త్వరలో నిర్ణయం

- ఎమ్మెల్యే పంతం నానాజీ



సమావేశంలో మాట్లాడుతున్న రమణరాజు తదితరులు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలంలోని 6 గ్రామాల విలీనం అంశంపై ప్రభుత్వం త్వరలోనే ఒక నిర్ణయం ప్రకటిస్తుందని ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) తూరంగి ప్రతినిధి వర్గానికి హామీ ఇచ్చారు. ఆదివారం తూరంగి ప్రతినిధి వర్గం ఎమ్మెల్యేను కలిసి 13 ఏళ్లగా పాలకవర్గమే లేని తూరంగిని కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కోరుతూ వినతి పత్రం అందించారు. దీంతో ఆయన స్పందించి విలీనంపై హామీ ఇచ్చారు. 25 వేల జనాభా ఉన్న తూరంగిలో 13 ఏళ్లుగా పాలక వర్గం లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యదర్శుల చేతుల్లో ఇష్టారాజ్యంగా పాలన సాగుతూ అవినీతికి ఆస్కారం ఏర్పడుతోందని ప్రతినిధి బృందం సభ్యులు ఎమ్మెల్యేకి వివరించారు. మరో ప్రక్క నిధుల కొరతతో, తాగు నీరు, డ్రైనేజీలు లేక ప్రజలు నరకం అనుభవిస్తున్నారన్నారు. వీటన్నింటికీ పరిష్కారం తూరంగిని కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయడమేనని తెలిపారు. కార్యక్రమంలో తూరంగి ప్రతినిధి బృందం నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్, జోగా అప్పారావు, ఎస్ రమేష్, జోగా వసుంధర, శర్మ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విలీనంతోనే అభివృద్ధి

కాకినాడ రూరల్: రూరల్ మండలంలోని 6 గ్రామాలను కాకినాడ నగరంలో విలీనం చేస్తే త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని పౌర సంక్షేమ సంఘం కన్వీనరు దూసర్లపూడి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో చీడిగ గ్రామంలో ఆదివారం గ్రామస్తులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి విలీనానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 24న రమణయ్యపేటలో సదస్సు నిర్వహిస్తామని సభ్యులు ప్రకటించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: భార్యపై అలిగి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరప పోలీసులు తెలిపిన కథనం మేరకు గొర్రిపూడికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ (50) రైతు. అతనికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మధ్య శ్రీనివాస్ మద్యానికి అలవాటు పడ్డాడు. ఈనెల 15వ తేదీన అతను మద్యం సేవించి ఇంటికి వెళ్లగా భార్య వారించి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీనివాస్ గడ్డిమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన భార్య అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్సకోసం 108లో కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లింది. శ్రీనివాస్ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ సుబ్రహ్మణ్యం సేవలు చిరస్మరణీయం



డాక్టర్ సుబ్రహ్మణ్యానికి నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు, యూత్ సభ్యులు

కరప: వేళంగి గ్రామంలో వైద్యునిగా, మాజీ సర్పంచ్‌గా డాక్టర్ బూసం సుబ్రహ్మణ్యం అందించిన సేవలు చిరస్మరణీయమని వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులు పేర్కొన్నారు. డాక్టర్ సుబ్రహ్మణ్యం 80వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి యూత్ సభ్యులు, గ్రామస్తులు నివాళులర్పించారు. సర్పంచ్‌గా గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపించి, ప్రజల మన్ననలు పొందారని వారు పేర్కొన్నారు.

నేడు పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

పిఠాపురం: స్థానిక రథాలపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలస్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలో వివిధ శాఖలకు చెందిన దిగువస్థాయి, డివిజన్, నియోజకవర్గ స్థాయి అధికారులు ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

సిరుల జల్లు కురిసేనా!

- వెదజల్లిన పొలాలు నీట మునక
- గింజ ముదిరితే పంటకు నష్టం
- సకాలంలో నీటిని తోడేస్తే సమస్య ఉండదంటున్న అధికారులు



కాకినాడ రూరల్ మండలంలో వెదజల్లు సాగు చేసిన పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

కాకినాడ సిటీ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వెదజల్లు సాగు చేపట్టిన పైరులో వర్షపు నీరు నిలబడటంతో మొలక శాతం తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాల పరిధిలో సుమారు 12 వేల ఎకరాలు సాగుబడిలో ఉండగా, సుమారు 650 ఎకరాల వరకు మొలక దశలో ఉన్న పొలాలు నీటిలో నానుతున్నాయి. విత్తనాలు ఐదారు రోజుల లోపు నీటిలో ఉన్నప్పటికీ ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఆ తరువాత గింజ మురిగిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ఇప్పటికే వెదజల్లు సాగుకు ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు విత్తనాలతో కలుపుకుని ఖర్చు చేశారు. ఈ వర్షానికి విత్తనాలు మురిగిపోతే అదనపు భారం పడుతుందని రైతులు వాపోతున్నారు. మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో పంట పొలాల్లో వర్షపునీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. దీనికి తోడు కాల్వల్లో తూటికాడ, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలు ఇంతటితో ఆగితే బాగుంటుందని రైతులు కోరుకుంటున్నారు.

కళకళలాడుతున్న మెట్ట పొలాలు

వర్షాలకు మెట్ట పైర్లు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది మెట్ట ప్రాంతాల్లో వంగ, బెండ, టమోటా, కంద, అరటి పంటలు ఎక్కువగా సాగు చేసేందుకు అన్నదాతలు మొగ్గు చూపారు. కాకినాడ రూరల్, కరప మండలాల్లోని పండూరు, నేమాం, తిమ్మాపురం, సర్పవరం, గంగనాపల్లి, రేపూరు, కరప, కొరిపల్లె, జెడ్ భావారం, గొడ్డటిపాలెం, వేములవాడ, కూరాడ, వేళంగి, పెదకొత్తూరు, యండమూరు, వడ్డిపాలెం, సిరిపురం తదితర గ్రామాల్లో ఈ పంటలు సాగుబడిలో ఉన్నాయి.

నీట మునిగిన వెదజల్లు సాగు రక్షణకు సూచనలు

అల్పపీడన ప్రభావంతో నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మునిగిపోయిన వెదజల్లు సాగుపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వెదజల్లు సాగులో విత్తుకుని మొలకరాని పొలాల్లో నిల్వ ఉన్న నీటిని సకాలంలో బయటకు పంపించినట్లయితే మొలక రావటానికి అవకాశం ఉందన్నారు. 10 నుంచి 30 రోజుల్లోపు పొలాల్లో నిల్వ నీటిని తీసివేయాలి. వర్షం తగ్గిన తర్వాత ఎకరానికి ఒక బస్తా డీఏపీ, 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేయాలి. వర్షాలు తగ్గిన తర్వాత వర్షపు నీరు 15 నుంచి 20 రోజుల నిల్వ ఉన్న పొలాల్లో 100 మిల్లీలీటర్ల బిస్పైరిబాక్, సోడియం 10 శాతం, లేదా ట్రియఫామాన్ ఇథాక్సిసల్ఫ్యూరస్ 30 శాతం మందును ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పొలంలో కలుపు నివారణకు పిచికారీ చేసుకోవాలన్నారు. విత్తన 25 రోజుల నుంచి 30 రోజుల మధ్య 8 గ్రాముల మెట్ సెల్ఫ్యూరాన్ మిథైల్, క్లోరిమూరున్ మందును ఎకరానికి 250 లీటర్ల నీటిలో కలిపి కలుపు నివారణకు పిచికారీ చేయాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీంతో ఆశాజనకమైన పంట దిగుబడులు సాధించేందుకు అవకాశముందన్నారు. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన పని లేదని అధికారులు అంటున్నారు.

వర్షపు నీటిని బయటకు పంపాలి



వెదజల్లు పద్ధతిలో సాగు చేసిన పంట పొలాల్లో వర్షపు నీటిని వెంటనే బయటకు పంపేలా చూడాలి. మొలకరాని గింజ ఐదు రోజుల వరకు నీటిలో ఉన్నప్పటికీ ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఆ తరువాత నీటిలో నాని మురిగిపోయి మొలక శాతం తగ్గుతుంది.

– ఏవీ రాజేష్, మండల వ్యవసాయాధికారి, కరప

అంతర్జాతీయ సదస్సుకు శ్రీప్రకాష్ విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చైనాలో సోమవారం నుంచి 28వ తేదీ వరకూ నిర్వహించే నిర్వహించే బెల్ట్ అండ్ రోడ్ ఇంటర్నేషనల్ టీనేజర్ మేకర్ క్యాంప్‌నకు కాకినాడ శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. హ్యాండ్ ఆన్ ప్రాజెక్టుల ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణతో పాటు వాతావరణ సమతుల్యత, పరిరక్షణ, పకృతి మార్పుల వంటి విషయాలపై సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ప్రతి దేశం నుంచి నలుగురు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులకు అవకాశం కల్పించారన్నారు. విద్యార్థులు సాయిశ్రీ శృతి చిట్టూరి, లక్ష్మీ ఆశ్రిత నామ, సంజన పల్లా, వాకచర్ల వైష్ణవిలతో పాటు ఉపాధ్యాయులు సుధాకర్ చంద్రయ్య, సంతానం సుందరం రామచంద్రన్‌లకు అవకాశం దక్కిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల డైరెక్టర్ విజయ ప్రకాష్ అభినందించారు.

ఘనంగా చండీహోమం

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, వేద పండితులు చిట్టెం హరి గోపాలశర్మల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల కోసమే లెక్చర్ గ్యాలరీ



గ్యాలరీ ప్రారంభిస్తున్న డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ

కాకినాడ క్రైం: జీజీహెచ్ ఎదురుగా రంగరాయ సెంట్రల్ లైబ్రరీని ఆనుకుని ఉన్న పారామెడికల్ లెక్చర్ గ్యాలరీని 1980 బ్యాచ్‌కి చెందిన రంగరాయ పూర్వపు విద్యార్థి, మాజీ మంత్రి, కై కలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ గురనాథరావు అధ్యక్షత వహించారు. రూ.60 లక్షలతో ఆధునీకరించిన ఈ భవంతిని వైద్య విద్యార్థుల కోసం అందుబాటులోకి తెచ్చామని శ్రీనివాస్ అన్నారు. రంగరాయ వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఆధునీకరణకు ముందుకు వచ్చి, భారీ ప్రాజెక్టును పూర్తి చేయడంలో సహకరించిన డాక్టర్ గురునాథరావు, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ వారా వెంకటరావు బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ జీఎస్ఎస్ మూర్తి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వాడ్రేవు రవి, రామ్‌కోశ అధ్యక్షుడు డాక్టర్ ఎంవి.ఆనంద్, 1980 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



వేళంగి హైస్కూలులో కలుసుకున్న 1977-79 బ్యాచ్‌ల విద్యార్థులు

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1977–79 బ్యాచ్‌ల పదో తరగతి విద్యార్థులు నాలుగున్నర దశాబ్దాల తరువాత కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకుని క్షేమ సమచారాలు అడిగి తెలుసుకున్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన మార్ని నారయ్యచౌదరి, రావుల సత్యం, పాత్రుని నరహింహారావు, డాక్టర్ లకమన సాయినాథ్‌రావు, రావుల వేణుగోపాలరావు, తలాటం భాస్కరరావు, కుంచే సాంబమూర్తి తదితరులు పాత స్నేహితులను కలిసి సంతోషంగా గడిపారు. ఆనాటి గురువులైన గోపాలకృష్ణ, గొట్టుముక్కల వేంకట నరసింహశాస్త్రి, ఎన్‌వీ రామారావు, మీనాక్షి, రావుల సత్తిరాజు, మూర్తి, దాసులకు పాదపూజ చేసి, ఘనంగా సత్కరించి, తమగురు భక్తిని చాటుకున్నారు. ఇదే పాఠశాల పూర్వ విద్యార్థులైన మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, డాక్టర్ బొండా వెంకన్నారావు, మెర్ల వీరయ్యచౌదరి, ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయులను కూడా సత్కరించారు.

శాకంబరిగా బాలాత్రిపుర సుందరి



శాకంబరి అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు



వివిధ రకాల కూరగాయాలు, పండ్ల అలంకరణలో అమ్మవారి ఆలయ ప్రాంగణం



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో తలుపులమ్మ తల్లి జాతర ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న గరగ నృత్యాలు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆదివారం అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఐదు టన్నుల కూరగాయాలతో ఆలయ పరిసరాలను ఆకర్షణీయంగా అలంకరించారు. వంకాయలు, బెండకాయలు, క్యాప్సికం, అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన గోంగూరతో పాటు వివిధ రకాల పండ్లుతో అమ్మవారి గర్భాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 200 మంది భక్తుల సహాయంతో ఆలయాన్ని అందంగా అలంకరించినట్లు ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారిని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ పాల్గొన్నారు.

ఘనంగా తలుపులమ్మ తల్లి జాతర

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని తలుపులమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ నెల 18 నుంచి అమ్మవారి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. చివరి రోజున గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు. నాలుగు రోజులు పాటు నిర్వహించిన ఉత్సవాలు ఆదివారంతో ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉప్పాలమ్మ తల్లికి కుంకుమ పూజలు

కరప: గ్రామ దేవత ఉప్పాలమ్మతల్లి ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కరప, పరిసర గ్రామాల నుంచి 120 మంది మహిళలతో వేదపండితులు విలపర్తి సత్యకృష్ణ, మాచరి సత్యకామేశ్వర పురుషోత్తమశర్మ పూజలు చేయించారు. వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు వితరణతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించగా గురు పౌర్ణమి సందర్భంగా ఆ కూరగాయలతో చేసిన కూరలతో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ, గొర్రెల శ్రీనివాస్, దేవు వీరబాబు, నక్కా వీరభద్రరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోతిని పూడ్చరూ..



డీఎస్ఏ స్టేడియం నుంచి నాగమల్లితోట జంక్షన్‌కు వెళ్లే మార్గంలో పెద్ద గొయ్యి పడడంతో వాహనచోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వల్ల గొయ్యి నిండా నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి గోతిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. – నాగమల్లితోట

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు లేవు
- రెండు శాఖల మధ్య కొరవడిన సమన్వయం

సామర్లకోట: పెద్దాపురం–సామర్లకోట మున్సిపాలిటీల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ జరిగి సుమారు ఏడేళ్లు గడుస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. విస్తరణ సమయంలో రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ ట్రాన్సుఫార్మర్లను మార్చాల్సి ఉన్నా ఆ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ప్రమాదాలపాలవుతున్నారు. స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మఠంసెంటర్ వరకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిని మార్చడానికి పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు ట్రాన్సుకోకు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఇది జరగకపోవడం గమనార్హం. అలాగే ప్రమాదాల నివారణకు రహదారి మధ్య డివైడర్లను నిర్మించగా, ప్రయాణికులు చుట్టూ తిరిగి రాలేక డివైడర్లను యథేచ్ఛగా దాటేస్తూ ప్రమాదాలపాలవుతున్నారు. దీంతో పోలీసులు ఆ ఖాళీలను మూసివేశారు. పెద్దాపురం రోడ్డులో ఎస్‌బీఐ, మెహర్‌కాంప్లెక్స్ వద్ద మాత్రమే రోడ్డును క్రాస్ చేసే అవకాశం కల్పించారు.

పొంచి ఉన్న ప్రమాదం..

పెద్దాపురం–సామర్లకోట రోడ్డులో ఎస్‌బీఐ వద్ద, పాత పెట్రోలు బంకుకు ఎదురుగా ఉన్న ట్రాన్సుఫార్మర్ల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆయా ప్రదేశాల్లో రోడ్డు ఇరుకుగా ఉండడంతో వల్ల అక్కడి ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ కూడా మున్సిపాలిటీ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల మార్పునకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సి ఉంది. పాత పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న రోడ్డు నిర్మించినప్పటి నుంచి గోతులతో నిండి వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. ఎన్ని పర్యాయాలు మరమ్మతు చేసినా పరిస్థితి మామూలే. ఈ సమస్య పరిష్కారానికి రోడ్డుపై నీరు డ్రైన్‌లోకి పోయేలా పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు సూచిస్తున్నారు.



పెద్దాపురం రోడ్డులో ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- దత్తాత్రేయ, బాబావార్లకు ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక రిజర్వ్ లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న దత్తత్రేయ స్వామికి, సాయిబాబాకు పంచామృతాభిషేకాలు, అర్చన నిర్వహించారు. ప్రత్యేక పల్లకిలో స్వామివార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయంవీధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆండాళ్‌గోష్ఠి, శ్రీకృష్ణాష్టకం, లక్ష్మీ అష్టోత్తర నామ స్తోత్రం, విష్ణు సహస్రనామస్తోత్రం పారాయణ నిర్వహించారు. అలాగే పేర్రాజుపేటలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమారు 500 మందికి అన్నప్రసాదం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు రమణ, కె.రాంగోపాల్ పాల్గొన్నారు. స్థానిక అశోక్ నగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో చంద్రాభట్ల నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో ఏకవార మహారుద్రాభిషేకం, లక్ష్మీగణపతి, బాబా దత్తాత్రేయ మూల మంత్ర హోమం నిర్వహించారు. దత్తాత్రేయస్వామి వారికి శత కలశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుత రామారావు ఏర్పాట్లు చేశారు. స్థానిక టూటౌన్, సాలిపేట, ఎస్ఎఫ్‌సియల్ రోడ్డులోని, సాంబమూర్తినగర్, భాస్కర్‌నగర్, పెద్దమార్కెట్‌లోని బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



అశోక్‌నగర్‌లోని సాయిబాబాను దర్శించుకునేందుకు క్యూలు కట్టిన భక్తులు



శ్రీపీఠంలో గురుపాదుకా పూజ నిర్వహిస్తున్న పరిపూర్ణానంద స్వామి

శ్రీపీఠంలో గురుపాదుకా పూజ

కాకినాడ రూరల్: వేద మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. సాయిబాబా ఆలయంలో వద్ద వేకువ జాము నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు. రమణయ్యపేటలోని శ్రీపీఠం వద్ద గురుపూజోత్సవాలు జరిగాయి. ఉదయం పరిపూర్ణానంద స్వామి గురుపాదుకా పూజ చేసి, భక్తులు గురువుల ప్రాముఖ్యతపై అనుగ్రహ భాషణం చేశారు.

ఆధ్యాత్మిక గురువులకు సత్కారం

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గురువులు గల్లా సుబ్బారావు, డాక్టరు వేదుల శ్రీరామశర్మ, జి.కృష్ణమోహన్, గరికపర్తి ఓం నమఃశివాయలను ఘనంగా సత్కరించారు. అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాజా, పార్థసారధి, వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గురువులకు సత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకృతి వైద్యుడు సద్గురు సచ్చిదానంద

ఘనంగా విశ్వగురు పూర్ణిమ వేడుకలు

కరప: మండలం నడకుదురులోని కుసుమసత్య ఫంక్షన్ హాలులో ఆదివారం అధ్యాత్మిక విశ్వగురువు, సైంటిఫిక్ సెయింట్ విశ్వస్ఫూర్తి దివ్య ఆశీసులతో కాకినాడ స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశ్వ గురుపూర్ణిమ వేడుకలు నిర్వహించారు. నన్నయ వర్సిటీ తెలుగుశాఖ ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ, ప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ చిట్టూరి విజయప్రకాష్, వైజాగ్ స్ఫూర్తి కుటుంబ ట్రస్టీ సభ్యుడు సదాశివం తదితరులు హాజరై మాట్లాడుతూ సాటి మనిషిని మనిషిగా గుర్తించి గౌరవించాలన్నారు. కాకినాడ ప్రకృతి వైద్యులు సద్గురు సచ్చిదానంద మాట్లాడుతూ గురువు అంటే వ్యక్తి కాదు, ఒకవ్యవస్థ అని తెలిపి, గురువు గొప్పతనాన్ని వివరించారు. కాకినాడ స్ఫూర్తి కుటుంబసభ్యులు మాధవరపు వీరరాఘవ రాము, ఎం.గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

కరప మండలంలో..

కరప: గురుపౌర్ణమి (వ్యాసపౌర్ణమి) సందర్భంగా ఆదివారం మండలంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురజనాపల్లి బాబా ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరిపురం, నడకుదురు, వేళంగి, కరప, కొంగోడు గ్రామాల్లోని శిరిడీ సాయి మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

హరిశ్చంద్ర పరిశోధన గ్రంథం ఆవిష్కరణ



హరిశ్చంద్ర పుస్తకావిష్కరణ చేస్తున్న వక్తలు

పెద్దాపురం: స్థానిక మహారాణి కళాశాల విశ్రాంత తెలుగు ఆచార్యుడు జోస్యుల కృష్ణబాబు రచించిన హరిశ్చంద్ర నాటక పరిశోధన గ్రంథాన్ని ఆదివారం సాయంత్రం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు అధ్యక్షతన జరిగింది. వక్తలు మాట్లాడుతూ రచయిత కృష్ణబాబు సేవలను కొనియాడారు. తొలుత మధునాపంతుల సత్యనారాయణ పుస్తకాన్ని ఆవిష్కరించగా జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం, పేపకాయల ప్రసాద్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లోవకు వర్షం ఎఫెక్ట్

తుని రూరల్: నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు లోవ దేవస్థానాకి వచ్చే భక్తులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు భారీగా తగ్గిపోయారు. ఆషాఢమాసంలో మొదట ఆదివారం 30 వేలు, రెండో ఆదివారం 40 వేల మంది భక్తులు వచ్చారు. ఆదాయం సైతం వరుసగా రూ.10 లక్షలు, రూ.11 లక్షలు వచ్చింది. ఈ వారం మరింత ఎక్కువ మంది భక్తులు వస్తారని, ఆదాయం పెరుగుతుందని అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా వర్షం కారణంగా భక్తుల తాకిడి తగ్గింది. ఆదివారం తలుపులమ్మ వారని 15 వేల మంది భక్తులు దర్శించుకోగా ఆదాయం రూ.4.99 లక్షలు వచ్చినట్టు ఇన్‌చార్జ్ డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. దీంతో రెండొంతులు భక్తులు, సగానికిపైగా ఆదాయం తగ్గినట్టయ్యింది. లోవలో అమ్మకానికి ఉంచిన పులిహోర ప్రసాదం మిగిలిపోయింది. పులిహోర ప్రసాదం పాడయ్యే అవకాశం ఉండడంతో వచ్చిన భక్తులకే ఉచితంగా అందించామని ఈఓ తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాలు విక్రయం ద్వారా రూ.1,99,060, పూజా టికెట్లకు రూ.92,680, కేశఖండనశాలకు రూ.14 వేలు, వాహన పూజలకు రూ.1900, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.1,08,092, విరాళాలు రూ.83,595 వెరసి మొత్తం రూ.4,99,327 ఆదాయం లభించిందన్నారు.